అప్పుడే నాకూ తట్టింది బంధువుల్ని చూడాలనే కాంక్ష. అదే వారి జీవితాల్ని, అందులోని మార్పును చూడాలనే కాంక్ష. ఆ కాంక్షతోనే యీ నాడు మా అక్కనీ బావనీ చూడ్డానికి బెజవాడ వచ్చాను.

కుర్చీలో కూర్చున్నాడు బావ. పక్కనున్న బల్లమీద ఒక కుర్రాడు ఏదో చదువుతున్నాడు. ఆ పిల్లవాడెవరై ఉంటాడో నేనూహించుకోలేక పోలేను. చాలా పరిచయమున్న ముఖంలాగనే కనుపించింది. కాని గుర్తుపట్టలేక పోయాను.

కుశలప్రశ్నలయాక "నాని" ఎక్కడున్నాడని అడిగాను.

"ఇడుగో వెధవ ఇక్కడున్నాడు" అన్నాడు పక్కనున్న పొట్టిపిల్లాడిని చూపెడుతూ.

నానిముఖంలో విషాదరేఖలు ప్రస్ఫుటంగా కనుపించాయి. బావముఖంలో ఉద్ధృతంగా విసుగుదల కనుపించింది.

తరువాత అక్క చెప్పింది. నాని పొట్టిగా ఉన్నాడని బావకసహ్యం. రోజూ "పొట్టి వెధవ పొట్టి వెధవ" అని తిడతాడట.

మార్పులేని జీవితంలో నిరాశ ప్రబలి నిస్పృహతో కుమిలి, క్రుంగి, కృశించి పోతున్నాడు నాని. ఒకనాడు నేలరాలిన చంద్రకాంతాల్ని చూచి విచారించాను. ఎప్పుడూ నేలరాలని చంద్రకాంతాలవల్ల ఆ పుష్పంలోని అందం ఏమీ తెలియదు. ఎల్లకాలమూ ఒకేవిధంగా ఉంటే బాగుండదన్న బావ నానిని చూచి అసహ్యించుకొంటున్నాడు కదా!

జీవితంలో మార్పు లేకపోతే మనకి జీవితం మీద ఆశ ఎలాగుంటుంది? సుఖం ఎలాగుంటుంది?

(ఆధారం: గార్డ్‌నర్)

కథానిక

# సహకరించిన ఇలవేల్పు

కె. ఆర్. రెడ్డి

"అరటి తోటలోనే దొంగలించాడు! అదీ గోపాల్ రెడ్డి తోటలో! హమ్మ బాబోయ్. ఇక వీడి వీపు బద్దలయి ఎముకలు గుళ్ళయిపోతాయి యివాళ!" ముక్కుమీద వేలేసుకుంది మంగమ్మ.

"మొన్న గడ్డి దొంగలించినపుడే కుయ్యో-మొర్రో అంటూ కాళ్ళావేళ్ళా పడితే-ఏదో పాపం అని వదిలేశాడు. ఇవాళ మట్టుకు రెడ్డి చేతుల్లో వాడి దివసాలు తీరిపోతవి!" చంకలోని కడవ కుదిటిమీద దించి పెడుతూ చెప్పుక పోయింది మీనాక్షమ్మ.

వీరారెడ్డి పేరువింటే ఆ చుట్టుపట్టుపల్లెల్లో పాలు తాగే పసికందు కూడా గజగజ వణకిపోతాడు. కడకు కాకిపిల్ల కూడా అతడు నడిచేత్రోవల్లో కావుమని అరవటానికి వీల్లేదు. అంత హోదా అంత ఠీవి!

బిఱ్ఱుగా బిగియపట్టి వెనుకకు కట్టిన పిడచ జుట్టు, మెలితిప్పి పైకి వదిలిన నల్లని ఖుర్రమీసాలు— గంభీరమైన ముహం—"ఏరా-వెధవా!" అని హుంకరించాడంటే ముందున్నవాడు నిలువుకా కంపించి కుప్పగా కూలిపోవాలి. అంతటి కాఠిన్యం ఆ కంఠ స్వరంలో.

ఆ హోదాకు-ఆ ఠీవికి అతడి ఆకార కాఠిన్యాలే కారణాలు అని చెప్పడానికి వీల్లేదు. ఆ మాటకువస్తే మాలవాడలోని ముత్తడుకూడా యింతకంటే ఠీవిగా వుంటాడు. వాడూ పెంచాడు మూరడేసి మెలిత్రిప్పిన సోగ మీసాలు. కానీ ఏం ప్రయోజనం? అన్నిటికీ ఆకార స్వరూపాలిచ్చే ఆ లక్ష్మీదేవి తెరవెనకాలుంటేనేగా నాటకాలు సవ్యంగా సాగడానికి! ఆ చుట్టుప్రక్కల ఏడూళ్ళూ వీరారెడ్డికి మాణ్యము. అతడి అజ్ఞ లేకుంటే ఆ పొలిమేరల్లో కాకి కూడా కాలు కదపడానికి వీల్లేదు. అతడి మాట తీసుకోనందే ఆ వూళ్ళో ఎవడూ ఏ పనీ చెయ్యడానికి వీల్లేదు. ఎక్కడ ఏ తప్పు జరిగినా-ఏ

దొంగతనము సంభవించినా యితని న్యాయంతో అది పరిష్కారం కావాల్సిందే.

"ఒరే-వెధవా! నీవు నూరు రూపాయలు అప రాధం వేశాను. ఎనిమిది రోజుల్లో తెచ్చి చెల్లిం చావా సరి. లేని పక్షంలో యిళ్ళూ-వాకిలీ అన్నీ వేలం వేయిస్తాను."

వాడు ఆ నూరు రూపాయలూ మొసలినోట్లో తల దూర్చి అయినా ఆ ఎనిమిది రోజుల్లో తెచ్చి చెల్లించాలిసిందే యిక. లేకపోతే వాడి ఒళ్ళూ హూనమౌతుంది-ఇల్లూ గుల్లయి కూర్చుంటుంది.

ఇంకో పోకిరిని చూసి "ఎముకలు విరగ బాదండ్రా లం——కొడుకును" అంటూ చేతనున్న కొరడాతో రెండు వాతలు తీశాడంటే ఇక వాడి జన్మలో మరచిపోలేడు ఆ శిక్షను.

"ఆ నూరు రూపాయలూ ఏమైనాయి?" అని ఎవళ్ళూ నోరెత్తి అడగరు, అడగడానికి ఎవళ్ళకూ సాహసమూ వుండదు. అలా అడగడానికి శక్తి వున్నవాళ్ళందరూ అతడి చుట్టపక్కాలే అయిరిమరి!

ఆ జుర్మానా ఆదాయమంతా శ్రీరాములువారి తిరునాళ్ళ వుత్సవాల ఖర్చులక్రింద జమ వ్రాయ బడుతుంది.

"అంత డబ్బూ ఖర్చయి పోయిందా?" అని ఎవరికేనా అడగాలని అనుమానం వస్తే——"చాలా డబ్బయి పోయిందే ఈ ఏడు!" అని సాశ్చర్యంగా—యీ పర్యాయం వుత్సవాలు బహుచక్కగా జరిగాయి, అందుకే అయిపోయింది అన్న భావం స్ఫురించేలా అతడి ముఖంలో చూస్తూ అడుగు తాడు. అతడు సమాధానంగా "ఆఁ—" అంటాడు. అంతే. ఇక ఎవరూ నోరు మెదపరు. మెదపలేరు కూడా. (ఇవి గ్రామసీమల రాజకీయాలు లెండి. ఇలానే వుంటాయి. అవి.)

* * *

సాయంత్రము మునిమాపు వేళకు అందరూ భోజనాలు ముగించుకుని సావటిముందు పోగై నారు. ఎవళ్ళకు తోచినట్టు వాళ్లు చెప్పుకుపో తున్నారు.

వీడికేమి పోయేకాలం వెంకయ్యా— యిలా దొంగతనంలోకి దిగేశాడు! ఇవాళ రెడ్డి వీణ్ణి ప్రాణాలతో వదలతాడంటావ్?"

"వేరేవాళ్ళయితే యీసరికే బొమికలు విరగ తన్ని వుండేవాడు. ఏదో బాగా బ్రదిగినకొంపలో పుట్టాడని రెండుపర్యాయాలుగా వదిలేశాడు. ఆ వరదయ్య విషయానికి చూడు. నిమ్మతోటలో కాయలు పెరికాడని ఏభైరూపాయలు జరిమానా విధించి పక్కలు విరగ తన్నేశాడు. ఇవాళ వీడిగతి కూడా అంతే—ఏ వందరూపాయలయినా వూడి పోతాయి."

మూడవ మనిషి తలదూర్చాడు——"అదీకాక గోపాలరెడ్డి యితడి స్వంత మేనత్తకొడుకు ఆయె-ఊరక వదుల్తాడా మరి!" అనేసి గడ్డంమీద వేలుంచుకుని బిక్కముఖంతో చూశాడు.

వీరారెడ్డివచ్చి తిన్నెమీద కూర్చోవడంతో యీ గుసగుసలన్నీ ఆగిపోయాయి. తీర్పు ఎలా వుంటుందో అని అందరూ కళ్ళుమిటకరించి వుత్కంఠగా చూస్తూ కూర్చున్నారు. వీరారెడ్డి లంక పొగాకుచుట్ట వెలిగించి ఒక దమ్ము లాగి ఎడమ మీసం మెలివేసి వదిలాడు. గొల్ల సుబ్బడు వచ్చి రెండుచేతులూ కట్టుకుని అతడిముందు మౌనంగా నుంచున్నాడు. వాడి ముఖంలో భయం లేదు. చింత—చీకాకు అసలే లేదు. కాలివ్రేలితో నేలను జీరాడుకుంటూ పరధ్యానంగా క్రిందకు చూసుకుని నిలబడ్డాడు.

"చూశావట్రా రమణయ్యా! వాడి ధైర్యము, రెడ్డిముందు అంత ధైర్యంగా నుంచున్నాడువాడు!" మళ్ళీ గుసగుసలు బయలుదేశాయి ఓ మూలనుంచి.

"వాడికేమిరా సిగ్గా-సిరమా? అన్నీ వదిలేసుకుని కూర్చున్నాడు. ఆ పెళ్ళాము ఎలా ఆడిస్తే అలా ఆడుతాడు. ఇంతకూ అది గొల్లది వున్నట్టావుంది యీమధ్య! రంగసానిలా తయారయిపోయింది. ఇంట్లోంచి కాలు కదిపి ఇటున్నపుల్ల అటు వేయ దురా అది! వీడి ఆర్జన సగం దాని సింగారాలకే అయిపోతూంటే దొంగలించక ఏమి వురి పోసు కుంటాడూ?"

వీరారెడ్డి బుర్రమీసాలనోసారి మెలిత్రిప్పి "ఏరా నీ సంగతి?" అంటూ చూశాడు సుబ్బడి వేపు. అందరూ నిశ్శబ్దమైపోయి కళ్ళప్పగించారు.

సుబ్బడు మాత్రం వులకలేదు-పలకలేదు.

"నిన్నేనోయ్ అడుగుతూంట. అరటితోటలో కాయలుకోసింది నీవేనా?" గర్జించాడు వీరారెడ్డి.

వాడు తలకూడా పైకి ఎత్తలేదు. కాలితో ఏదో గీరాడుతూనే వున్నాడు. 'ఆశ్చర్యం!' అక్కడున్నవాళ్ళందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. "వెధవకొడుకు ఏదైనా చెప్పుకుని ఏడవ రాదూ! ఇక అతడు లేశాడా ఒళ్ళు హూనమై కూర్చుంటుంది." భయపడ్డారు గొల్లపాళ్యం వాళ్ళు కొందరు.

వీరారెడ్డి అలానే కాసేపు కూర్చొనుండి దీర్ఘంగా ఆలోచించినలా కనుబొమలు ముడివేసి, "వెధవ కొడకా! ఇంకో పర్యాయం యిలాంటి పనులు చేశావంటే చర్మం ఒలిచేస్తాను జాగ్రత్త. పదిరూపాయలు జరిమానా వేస్తున్నాను. రేపు వుదయంలోపున వచ్చి సావటిదగ్గర చెల్లించు. లేకపోతే ప్రక్కలు విరగతాయి. ఛో, యిక్కణ్ణుంచి" అనేసి కాశ్మీరు శాలువ దులుపుకుని పైకిలేచాడు.

సుబ్బడు తల దించేసుకుని మెల్లగా వెళ్ళిపోయాడు.

అక్కడ నుంచున్న ఆబాలగోపాలం దిగ్భ్రాంతమైపోయింది. పానకంలో పిండుకోవడానికి రెండు నిమ్మకాయలు కోసిన ముత్తడికి ఏభైరూపాయలు అపరాధం.

చెంగారెడ్డి పొలంలో ఆబోతును మేపినందుకు అప్పలస్వామికి ఎముకలు విరగవిన్నదంతోసహా యిరవైరూపాయలు జరిమానా.

వంగతోటలో ఒకతట్ట వంకాయలుకోసినందుకు కాళప్పకు నిశ్శేషంగా నూరురూపాయలు శిక్ష.

కాని-కాని—యివాళ వీరారెడ్డి బావమరిది తోటలోనే—అమ్మి డబ్బు సంపాదించడానికి అరటికాయలు దొంగిలించిన సుబ్బడికి మాత్రం పది రూపాయలు—ఒకే పదిరూపాయలు జరిమానా! అందరూ కాసేపు అలానే ఆశ్చర్యంగా నుంచుండిపోయారు. వాళ్ళ బుర్రల్లో ఎంత వెదికినా యీ క్రొత్త సానుభూతికి కారణం అవుపించలేదు. ఒక్కమారు కాదు—ఇది మూడవ పర్యాయం సుబ్బడి కేసు యింత తేలిగ్గా ఫయిసలయిపోడం.

"పోనిద్దువు గోపాలరెడ్డీ-ఏదో బ్రతికి చెడ్డ వెధవ ఏమనటానికీ మనసు పోలేదు." అనేసి గోపాల్ రెడ్డితో యింటికి దారిపట్టాడు వీరారెడ్డి.

"బ్రతికి చెడ్డవెధవ! అయితే మాత్రం ఆ జాలి అందరిమీదా ఎందుకు వుండకూడదు?" అని పది పదిహేనుమంది అంతరాత్మల్లో అనుకుని వెళ్ళిపోయారు. ఆ మాటే ప్రక్కవాడితో కూడా అనడానికి ఎవళ్ళకీ గుండెలు చాలవు. గోడలకు చెవులుంటాయి. ఎక్కడొచ్చిన పీడ!

• • •

రాత్రి రెండు గంటలు. అంతా నిశ్శబ్దంగా వుంది. పొగమంచుదట్టంగా క్రమ్ముకుంది. ఎక్కడో వూరి మూల ఒకటిరెండు కుక్కలుమాత్రం రాగాలు తీస్తున్నాయి.

గొల్లపాళెంలో సుబ్బడి యింటితలుపు 'టక్కు-టక్కు'మని తట్టిన శబ్దమయింది. ప్రక్కింటి తిన్నెపైన పడుకుని చలిబాధకు నిద్రరాని ముసలాడు మెల్లగా ముసుగు తొలగించి చూశాడు.

తలుపు తెరుచుకొంది. ఒక కంబళి భుజాన వేసుకుని సుబ్బడు బయటపడ్డాడు.

"—కొడుకా! ఇలాంటి వెధవపనులు చెయ్యవద్దని ఎన్ని పర్యాయాలు చెప్పడం! ఇదిగో—ఆ వచ్చిన వ్యక్తి అందించాడు.

చేతిలో ఏదో కాగితం రెపరెపలాడింది. పొగమంచు. అది పది రూపాయల కాగితం అని అంత నిర్దుష్టంగా అవుపించదు. సుబ్బడు నోటు నందుకుని జేబులో వుంచుకుంటూ రోడ్డుమీదికి వచ్చి వీరారెడ్డి కొట్టంవేపు వెళ్ళిపోయాడు.

ఆ ఎత్తైన వ్యక్తి వెనక్కు తిరిగి వీధిలోకి చూశాడు. పిడచ జుత్తు. బుర్రమీసాలు-గంభీరమైన ముహం-కాశ్మీరు శాలువ. ఘరానా మనుష్యుడే! ఆ మంచులో కూడా అవుపిస్తోంది ఆ ఠీవి.

ముసలాడు పైకి లేవబోయి, అలానే ముడుచుక పడుతున్నాడు చప్పుడు చేయకుండా. అతడి గుండె "పాపం! బ్రతికి చెడ్డవాడు" అని ఏదో కలవరించింది. కాని పెదవులు ఆరిపోయాయి.

ఆ వ్యక్తి సుబ్బడి ఇంట్లోకి వెళ్ళి గొళ్ళెం పెట్టేశాడు లోపల్నుంచి.

లోపల సుబ్బడి పెళ్ళాము, రంగసానిలాంటి పెళ్లాము! బ్రతికిచెడ్డ కుటుంబము!

ముసలాడు ముహం పైకి ముసుగు తీసుకుని అలానే ముడుచుక పడుకొన్నాడు. ★